ప్రజాశక్తి

శనివారం 31 మే 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

రాష్ట్రపతి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్ హరేంధిర ప్రసాద్

వార్త 2లో..

ఉక్కు కాంట్రాక్టు కార్మికులను

విధుల్లోకి తీసుకోవాలి

కలెక్టర్‌కు సిపిఎం ప్రతినిధి బృందం వినతి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 20 నుంచి జరుగుతున్న ఉక్కు సమ్మెలో పాల్గొన్నారన్న కక్షతో స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం 1470 మంది కాంట్రాక్ట్ కార్మికులకు కర్కశంగా బయోమెట్రిక్ తొలగించి గేటు బయట నిలిపివేసిందని, వారిని తక్షణమే విధుల్లోకి తీసుకునే చర్యలు చేపట్టాలని కోరుతూ సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, నాయకులు పి.వెంకట్ రెడ్డిలతో కూడిన ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేసింది. కూర్మన్నపాలెం ఉక్కు దీక్షా శిబిరంలో నిరసన వ్యక్తం చేయడానికి మిగతా 2లో..

బెట్టింగ్ కేసుల్లో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్న ముగ్గురిని వేర్వేరు చోట్ల అరెస్టు చేసినట్టు విశాఖ నగర పోలీసు కమిషనరేట్ అధికారులు శుక్రవారం తెలిపారు. గాజువాకకు చెందిన ఒక బాధితుడు ఇచ్చిన రిపోర్టు ఆధారంగా తాము ముందుకు సాగామన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని ఆశ చూపించి, బెట్టింగ్‌లకు అలవాటు చేసి, పలువురి జీవితాలను నాశనం చేస్తున్న విజయనగరం జిల్లా మిగతా 2లో..



మొదటి పేజీ తరువాయి..

ఉక్కు కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

వస్తున్న కార్మికులకు పోలీసులు ఆటంకాలు కల్పిస్తున్నారని, తక్షణం వాటిని నిలిపివేసేలా చూడాలని కోరింది. ఈ సందర్భంగా ఉక్కులో జరుగుతున్న పలు పరిణామాలను జగ్గునాయుడు వివరించారు. విశాఖ ఉక్కు కాంట్రాక్ట్ కార్మికులు వారి ఉపాధి, హక్కుల రక్షణ కోసం, మనుగడను నిలుపుకునేందుకు గత్యంతరం లేని స్థితిలోనే నిరవధిక సమ్మెకు దిగిన విషయాన్ని గుర్తుచేశారు. వారంతా మూడు దశాబ్దాలుగా స్టీల్ ప్లాంట్ ఉత్పత్తిలో కీలకపాత్ర పోషిస్తున్న వారేనన్నారు. వేల మందిని అర్థాంతరంగా తొలగిస్తుంటే తమ కుటుంబ జీవితాలను కాపాడాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు వారు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయిందన్నారు. కార్మికుల సమస్యను సానుభూతితో పరిష్కరించి ఉపాధిని రక్షించాల్సిన యాజమాన్యం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో నిర్బంధం ప్రయోగించిందని, బెదిరింపులకు పూనుకుందని అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సమ్మె చేస్తున్న కార్మికులపైనా, వారికి అండగా ఉన్న కార్మిక నాయకులపైనా అక్రమ కేసులు పెట్టిందన్నారు. గతంలో తొలగించిన సుమారు 2500 మంది కార్మికులకు అదనంగా, సమ్మె చేశారనే కక్షతో ఇటీవల 1470 మంది కార్మికులను తొలగించిందన్నారు. ఇది అన్యాయం, చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. తొలగించిన వారి కుటుంబాలన్నీ రోడ్డున పడ్డాయన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలంటూ సుమారు 1570 రోజులుగా కూర్మన్నపాలెం జంక్షన్‌లో దీక్షా శిబిరం నడుస్తోందన్నారు. కార్మికులు నిరసన తెలియజేసేందుకు ఈ శిబిరమే వేదికైందని తెలిపారు. దీన్ని జాతీయ, రాష్ట్రీయ నాయకులు అనేక మంది సందర్శించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ శిబిరంలో యాజమాన్యంచే తొలగించబడిన కాంట్రాక్ట్ కార్మికులు నిరసన వ్యక్తం చేస్తుంటే పోలీసులు ఆటంకపరుస్తున్నారన్నారు. ఇది కార్మికుల ప్రజాతంత్ర హక్కులను పూర్తిగా కాలరాయడమే అవుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి ఉత్పత్తితో, లాభాల బాట పట్టించేందుకే కార్మికులను తొలగిస్తున్నామని, కార్మికులు అదనంగా ఉన్నారని యాజమాన్యం తెలపడం సరికాదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ సెయిల్‌లో ప్రతి టన్ను స్టీల్ ఉత్పత్తికి 2700 మంది కార్మికులు ఉన్నారని, దీని ప్రకారం వైజాగ్ స్టీల్‌లో 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తికి సుమారు 19 వేల మంది పర్మినెంట్ కార్మికులు అవసరమని, ప్రస్తుతం 10943 మంది మాత్రమే ఉన్నారని, పర్మినెంట్ కార్మికులు చేసే పనులను కాంట్రాక్ట్ కార్మికులు చేస్తున్నారని, వీరిని కూడా వేల సంఖ్యలో తొలగిస్తే ఉత్పత్తికి తీవ్ర విఘాతం కలుగుతుందని తెలిపారు. ఇదే విషయాన్ని డిపార్టుమెంట్ స్థాయి అధికారులు మొరపెట్టుకుంటున్నా కేంద్ర ప్రభుత్వం ఆదేశమంటూ విశాఖ ఉక్కు యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికులను కర్కశంగా తొలగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాంటులో మూడో బ్లాస్ట్ ఫర్నేస్ ప్రారంభమైతే ప్రస్తుత పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులతో పాటు అదనంగా కార్మికులు అవసరమని, ఖర్చు తగ్గింపు పేరుతో కాంట్రాక్ట్ కార్మికుల జీవితాలను బలి చేయడం సరికాదని, వారి జీతాల కోసం యాజమాన్యం పెట్టే ఖర్చు నామమాత్రమేనని జిల్లా కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ స్పందిస్తూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యంతోనూ, పోలీసు ఉన్నతాధికారులతోనూ మాట్లాడి సానుకూల చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు.

ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

ఉక్కు సమ్మెకు సంఘీభావంగా ర్యాలీ

ఎంవిపి.కాలనీ : స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల సమ్మెకు సంఘీభావంగా సిఐటియు మద్దిలపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యాన శుక్రవారం సాయంత్రం మద్దిలపాలెంలోని కళాభారతి నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకూ ర్యాలీ చేపట్టారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, తొలగించిన 4500 మంది స్టీల్ కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని నినాదాలు చేశారు. డిపో వద్ద జరిగిన సభలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కెఎం.కుమార్ మంగళం, నాయకులు డి.అప్పలరాజు, పి.వెంకటరావు, వి.కృష్ణారావు, వి.నరేంద్ర కుమార్, కె.కుమారి, ఎంసిహెచ్.అప్పడు పాల్గొన్నారు.

బెట్టింగ్ కేసుల్లో ముగ్గురు అరెస్టు

చీపురుపల్లి మండలం ఇప్పవలసకు చెందిన పెనుమజ్జి శ్రీనివాసరావును, గరివిడి మండలం రేగటి అగ్రహారానికి చెందిన మోదుల అరవింద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. వారు www.national999.com వెబ్ సైట్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ నిర్వహించేవారన్నారు. మరో కేసులో ప్రధాన ముద్దాయి అయినటువంటి అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం రాయిపోడు పాలెం గ్రామానికి చెందిన ఆడారి సురేష్‌ను పట్టుకున్నామన్నారు. నిందితుల నుంచి మరికొంత కీలక సమాచారం రాబట్టామన్నారు.

ట్రాఫిక్ మేనేజర్ రామశేఖర్‌కు అభినందనలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోర్ట్ అథారిటీలో ట్రాఫిక్ మేనేజర్‌గా ఇటీవల ఉద్యోగోన్నతి పొందిన జి.రామశేఖర్ యాదవ్‌ని అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి కటారి శోభన్ కుమార్ ఆధ్వర్యంలో పోర్ట్ అథారిటీ గిరిజన ఉద్యోగులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు అప్పలరాజు, కృష్ణ, కృష్ణారావు, ఎల్‌బి.అప్పన్న, ఎ.సంజీవి, బాబు నాయక్, కృష్ణమూర్తి, చిట్టయ్య, శేఖర్, బాలరాజు, సన్యాసిరావు పాల్గొన్నారు.

రాష్ట్రపతి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ / ఎంవిపి.కాలనీ : జూన్ 10న విశాఖపట్నంలో జరగనున్న కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు రాష్ట్రపతి ద్రౌపదీముర్ము విచ్చేస్తున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ భవనంలో శుక్రవారం కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం విసి టి.వి.కట్టిమణితో కలిసి వివిధ అంశాలపై సమీక్షించిన ఆయన అధికారులకు కార్యక్రమ నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. జూన్ 10 ఉదయం 11.30 గంటలకు రాష్ట్రపతి విశాఖపట్టణం అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకుంటారని, అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా బీచ్ రోడ్డులోని ఎయు కన్వెన్షన్ హాలుకు విచ్చేస్తారని పేర్కొన్నారు. అక్కడ జరిగే కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవంలో పాల్గొంటారని చెప్పారు. 12 గంటల నుంచి 1 గంటల వరకు జరిగే కార్యక్రమ అనంతరం ఆమె రోడ్డుమార్గం ద్వారా విమానాశ్రయానికి చేరుకుని తిరిగి పయనమవుతారని వివరించారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. రోడ్డు మార్గం ద్వారా రానున్న నేపథ్యంలో సుందరీకరణ పనులు, మరమ్మతులు చేపట్టాలని చెప్పారు. జ్ఞానాపురం రేల్వే అండర్‌పాస్ వద్ద నీరు నిలిచిపోకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఒకవేళ వర్షం కురిస్తే మోటార్ల ద్వారా నీటిని తొలగించాలని జివిఎంసి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఐఎన్ఎస్ డేగా నుంచి కన్వెన్షన్ హాలు వరకు ఎలాంటి హోర్డింగులు, విద్యుత్ తీగలు, ఇతర అడ్డంకులు లేకుండా తొలగించాలని సూచించారు. ఎయు కన్వెన్షన్ హాలు వద్ద సిటింగ్ ఏర్పాట్లు, ప్రోటోకాల్ నిబంధనలు పక్కాగా ఉండేలా చూసుకోవాలన్నారు. రాష్ట్రపతితో పాటు, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి రానున్న క్రమంలో ప్రత్యేక గ్రీన్‌రూమ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డు మార్గంలో, ఎయు కన్వెన్షన్ హాలు వద్ద పారిశుద్ధ్య పరమైన ఇబ్బందులు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. నిపుణులతో కూడిన వైద్యబృందం, అత్యంత ఆధునిక వసతులు కలిగిన అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం విసి టి.వి.కట్టిమణి, డిసిపిలు అజిత, మేరీ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్, డిఆర్‌ఓ బిహెచ్ భవానీశంకర్, ఆర్‌డిఒలు పి.శ్రీలేఖ, సంగీత్ మాధుర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

జూన్ 10న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విశాఖలో పర్యటించనున్న నేపథ్యంలో ఆమె పర్యటించే ప్రాంతాల్లో ఏర్పాట్లను విశాఖ జిల్లా కలెక్టర్ ఎమ్ ఎన్ హరేంద్ర ప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. మొదట బీచ్‌రోడ్ లోని ఎయూ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుని ఏర్పాట్లు పరిశీలించిన అనంతరం కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ట్రైబల్ యూనివర్సిటీ విసి టీవీ కట్టమణి , ఇతర అధికారులు పాల్గొన్నారు.

మత్స్యకార భరోసా సగం మందికే..

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అందించే మత్స్యకార భరోసా 50 శాతం మంది అర్హులకు అందలేదని మాజీ ఎమ్మెల్యే, వైసిపి దక్షిణ ఇంచార్జ్ వాసుపల్లి గణేష్ కుమార్ ఆరోపించారు. ఉత్తరాంధ్ర మత్స్యకారుల జాతర ఉత్సవానికి రూ.20 వేలు విరాళం ఆయన అందించారు. శుక్రవారం ఆసీలుమెట్ట కార్యాలయంలో మత్స్య పారిశ్రామిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ చింతపల్లి పోతురాజు, ఉపాధ్యక్షుడు కాసరపు వెంకటేశ్వరరావు లకు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మత్స్యకారులకు భరోసా క్రమం తప్పకుండా చెల్లించేవారమన్నారు. మత్స్యకార భరోసా అర్హులందరికీ అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మత్స్య పారిశ్రామికుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, స్థానిక వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మత్స్యకారుల జాతరకు విరాళం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి

యువ అథ్లెట్లను ప్రోత్సహిస్తూ ప్రచారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇన్‌స్టెంట్ ఎనర్జీ డ్రింక్ డాబర్ గ్లూకోజ్ యువ క్రీడా అథ్లెట్లను ప్రోత్సహించడానికి దేశమంతటా ఎనర్జైజ్ ఇండియా ప్రచార కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం విశాఖపట్నం వేదికగా ప్రారంభించింది. ఈ సందర్భంగా నగరంలోని సాయి అకాడమీలో శక్తి స్టామినా నిర్వహణపై ప్రత్యేక అవగాహనా కార్యక్రమం చేపట్టారు. ప్రఖ్యాత వైద్యులు సత్యనారాయణ, డాబర్ ఇండియా సంస్థ ప్రతినిధి దినేష్ కుమార్ పాల్గొని అవసరమైన సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో డాబర్ ఇండియా లిమిటెడ్ మార్కెటింగ్ హెడ్ - హెల్త్ సప్లిమెంట్స్ అమిత్ కార్గ్ పాల్గొన్నారు. అథ్లెట్లు విజయలక్ష్మీ, ప్రవళిక, బి.అభిరామి, ఈశ్వర్, గోపిలను సత్కరించారు.

స్మార్ట్ ట్రావెల్ స్టోర్ ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రయాణ అవసరాల కోసం తమ స్మార్ట్ ట్రావెల్‌స్టోర్‌ను ప్రత్యేకంగా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు అమెజాన్ ఇండియా ప్రతినిధి శ్రీన్ వెల్లడించారు. శుక్రవారం ఆయన ఓ హోటల్లో ఆతిథ్య రంగానికి చెందిన ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.99కి అమెజాన్ బజార్ ప్రయాణ అవసరాలతో స్మార్ట్‌ట్రావెల్ స్టోర్ ప్రారంభం కాగా, రూ.150 వరకు క్యాష్‌బాక్ పొందవచ్చన్నారు.

యోగా డే పకడ్బందీగా నిర్వహించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జూన్ 21న విశాఖపట్నంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ట్రాఫిక్, పార్కింగ్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ విసి హాల్లో అధికారులతో సమీక్షించారు. 21న కాళీమాత టెంపుల్ నుంచి భీమిలి వరకు ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసే వేదికలతో పాటు, అనువైన ప్రాంతాల్లో మరొక 25 అదనపు వేదికలు ఏర్పాటు చేస్తున్నామని అక్కడ అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తూ పక్కా ఏర్పాట్లు చేయాలని నిర్దేశించారు. ప్రధాన వేదికతో పాటు ఎంజిఎం గ్రౌండ్, వివిఎంఆర్‌డిఎ పార్కు, అప్పూఘర్ ఎగ్జిబిషన్ గ్రౌండ్ సహా పలు ప్రాంతాల్లో యోగాసనాలు వేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు.

లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా ఉద్యమం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కార్మికులకు తీవ్ర నష్టం చేకూర్చే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలంటూ ఐక్య ఉద్యమం చేపట్టాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం పిఠాపురం కాలనీలోని సిఐటియు కార్యాలయంలో సంఘం మద్దిలపాలెం జోన్ 10వ మహాసభ జరిగింది. తొలుత అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం జరిగిన సభను ఉద్దేశించి కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను హరిస్తున్నాయన్నారు. కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మికులను మరింత బానిసలుగా మారుస్తున్నాయన్నారు. ఈ లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా జూలై 9న దేశవ్యాప్త సమ్మెకు సిద్ధం కావాలన్నారు. అనంతరం కార్యదర్శి నివేదికను పి.వెంకటరావు ప్రవేశపెట్టారు. మహాసభకు ముందు సీనియర్ నాయకులు పీతల అప్పారావు సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కుమార్ మంగళం, నాయకులు పి.శంకర్, డి.కొండమ్మ పి.రాజ్‌కుమార్, కె.సత్యనారాయణ, కుమారి, అప్పడు, నాయుడు, కుమార్ పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి అర్పిస్తున్న కుమార్ తదితరులు

చినుకుపడితే చిత్తడే!

- దుర్గంధభరితంగా వేములవలస పూలమార్కెట్
- అధ్వానరోడ్డుతో వాహనదారులు, రైతులు, ప్రజల అవస్థలు
- కోట్లలో ఆదాయమున్నా, నిర్వహణలో నిలువెత్తు నిర్లక్ష్యం

ఇరువైపులా దుకాణాలతో ఇరుకుగా మారి అధ్వానమైన మార్కెట్ రోడ్డు

ప్రజాశక్తి-ఆనందపురం: నిత్యం లక్షల్లో వ్యాపారం, ఏటా కోట్ల ఆదాయం, వందలాది వాహనాలు, అదే స్థాయిలో రైతులు, వ్యాపారులు, కొనుగోలుదారులతో కిటకిటలాడే వేములవలస

చిన్నపాటి వర్షానికే చిత్తడిమయంగా మారిన పూలమార్కెట్

మహాత్మాగాంధీ పూల మార్కెట్ వద్ద పారిశుధ్య పరిస్థితి అధ్వానంగా ఉంది. మార్కెట పరిసరాలతోపాటు ఇక్కడ రహదారి దుస్థితి దయనీయంగా ఉంది. చినుకు పడితే చిత్తడి మడుగులు, బురదమయం, క్షీణించిన పారిశుధ్యం, అడుగుతీసి, అడుగు వేయలేనంత అధ్వానస్థితిలో వాహనదారులు, రైతులు, స్థానిక ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

. వేములవలస పూలమార్కెట్ ఉత్తరాంధ్రలోనే ముఖ్యమైన వాణిజ్య కేంద్రం. ఈ మార్కెట్ ద్వారా పంచాయితీకి ఏటా కోట్లలో ఆదాయం సమకూరుతోంది. అయినా ఇక్కడి రహదారి అభివృద్ధికి ఎటువంటి చర్యలు కానరావు. రోడ్డు పక్కనే అనధికార వ్యాపారాలతో కూడలి ఇరుకుగా మారింది. దీనికితోడు రైతులు వ్యర్ధాలను రోడ్డు పక్కనే పడేయడంతో, చినుకురాలితే అవి మురిగిపోయి, గుంతల్లో పేరుకుపోయి మురుగు నీరు, చెత్తతో వాహనదారులకు భయానక అనుభవాలను కలిగిస్తోంది. ఆనందపురం, బోని రోడ్డులో నిత్యం వందలాది వాహనాలు, ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే కోట్ల ఆదాయం సమకూరుతున్నా రహదారి నిర్వహణ, మరమ్మతుల్లో అధికారుల నిర్లక్ష్యం వల్ల మార్కెట్‌కువచ్చే అన్నివర్గాలు అవస్థలు పడక తప్పని పరిస్థితి. అంతేకాక తరచూ అనేక ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామపంచాయతీ, అధికారులు దీనిపై దృష్టిపెట్టి పూలమార్కెట్‌లో పారిశుధ్యం, రహదారులు, ఇతర సౌకర్యాలను మెరుగుపరచాలని పలువురు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

ఇంటిలో జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నక్కపల్లి: మండలంలోని చినతీనార్ల గ్రామంలో సిరిసిల్లి మరియయ్య (45) తన ఇంటిలో పనిచేస్తుండగా కాలుజారి పడి మృతి చెందినట్లు సీఐ కుమారస్వామి తెలిపారు. సిరిసిల్లి మరియయ్య తన ఇంటిలో పెయింటింగ్, వైరింగ్ పనులను కార్మికులతో చేయిస్తున్నారు. ఇంటిలో పనులు జరుగుతుండగా మరియయ్య తన ఇంటిలో కాలు జారీ కిందనపడ్డాడు. ఈ ప్రమాదంలో మరియయ్య తలకు తీవ్ర గాయమై, స్పృహ కోల్పోయాడు. గాయపడ్డ బాధితుడిని నక్కపల్లి ఆసుపత్రికి తరలించారు.పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు సిఐ తెలిపారు.

ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలి

జీపుజాతా పోస్టర్ ఆవిష్కరిస్తున్న గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి -గాజువాక : గిరిజన ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ అధ్యక్షులు కె.చిన్నంనాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం కంచరపాలెం కార్యాలయంలో జీపు జాతా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఏజెన్సీలో గిరిజనులకు శతశాతం ఉద్యోగాల కల్పన డిమాండ్‌తో ఈ నెల 31న రాష్ట్రవ్యాప్త ఏజెన్సీ ప్రాంత జీపు జాతా నిర్వహించనున్నామని, దీన్ని జయప్రదం చేయాలని కోరారు.కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు టి చిట్టిబాబు, పూర్వ అధ్యక్షుడు ఎస్.దామోదర్ పాల్గొన్నారు.

'సాయి గణపతి'లో 2 నుంచి ఉచిత బ్రిడ్జి కోర్సు తరగతులు

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలో గిడిజాల సాయిగణపతి పాలిటెక్నిక్ కళాశాలలో పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరబోయే విద్యార్థులకు ప్రత్యేకంగా బ్రిడ్జ్ కోర్స్ తరగతులను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై మహేశ్వరరావు తెలిపారు. ఈ కోర్సు ద్వారా, విద్యార్థులు 10వ తరగతి వరకు నేర్చుకున్న సబ్జెక్టుల నుంచి పాలిటెక్నిక్ విద్యలో ఉండే సబ్జెక్టులకు సరళమైన మార్గాన్ని ఏర్పరచుకునే అవకాశం లభించనుందన్నారు. జూన్ 2 నుంచి ప్రారంభమైన ఈ బ్రిడ్జికోర్సు రెండు వారాలపాటు జరుగుతుందన్నారు. జూన్ 2 నుంచి ఈకోర్సుకు ఏ విధమైన ఫీజు, సర్టిఫికెట్‌లు సమర్పించాల్సిన అవసరం లేదన్నారు. విద్యార్థులకు పాలిటెక్నిక్ కోర్సుకు అవసరమైన ప్రాథమిక జ్ఞానాన్ని బలపర్చేలా తరగతులు రూపొందించబడ్డాయన్నారు.కళాశాల కరస్పాండెంట్ ఎస్. వేణుగోపాల్ మాట్లాడుతూ, ఈ తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, ఎస్‌కోట, భీమిలి వంటి ప్రాంతాల నుంచి ఉచిత బస్సు సదుపాయం కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు 95814 67711, 87906 35885 , 81425 89853,95819 50681 నెంబర్లకు సంప్రదించాలన్నారు

నైజీరియాలో పెట్టుబడి అవకాశాలపై 'గీతం'లో సదస్సు

ప్రజాశక్తి- మధురవాడ : ఆఫ్రికాలోని నైజీరియాలో 34 ఏళ్ల క్రితం ఏర్పడిన జిగావా రాష్ట్రంలో భారతీయులకు పెట్టుబడి అవకాశాలపై ఎపి చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ (ఎపిసిసిఐఎఫ్) ఆధ్వర్యంలో గీతంవిశ్వవిద్యాలయం బిజినెస్ స్కూల్‌లో శుక్రవారం పెట్టుబడిదారుల సదస్సు సమావేశం నిర్వహించారు

జిగావా రాష్ట్ర గవర్నర్ మల్లం ఉమర్ నమాది నేతృత్వంలో నైజీరియా వ్యవసాయ మంత్రిత్వశాఖకు చెందిన సీనియర్ అధికారులు, జిగావా రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, ఫార్మర్స్ అండ్ హర్డ్స్‌మెన్ మేనేజ్‌మెంట్ బోర్డుకు చెందిన సాంకేతిక నిపుణుల బృందం జిగావాలో వ్యవసాయాభివృద్ధి, అంతర్జాతీయ సహకారం, తమ రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలను వివరించారు.

గీతం ప్రో వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ వై. గౌతమరావు అధ్యక్షత వహించిన సదస్సులో జిగావాలో డెయిరీ స్టార్టప్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్న భారతీయ పారిశ్రామికవేత్త చంద్రశేఖర్, గీతం ఇంటర్నేషనల్ స్టూడెంట్ వ్యవహారాల డైరెక్టర్ డాక్టర్ కె.పి.కిషన్, ఎపిసిసిఐఎఫ్ మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ యార్లగడ్డ గీత, వైస్ ఛైర్‌పర్సన్ లీలారాణి, గీతం బిజినెస్ స్కూల్ ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

వలస నేతలకు అందలంపై గుర్రు!

పదవుల పందేరంలో టిడిపి సీనియర్ల అసంతృప్తి

ప్రజాశక్తి - ఆనందపురం : తెలుగుదేశం పార్టీ సంస్థాగత పదవులు, నామినేట్ పోస్టుల ఎంపికపై పార్టీ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. కష్టకాలంలో పార్టీని అట్టిపెట్టుకుని ఉండి నిబద్ధతతో పనిచేసే సీనియర్లను విస్మరించి, ఇతర పార్టీల నుంచి వలస వచ్చిన నేతలకు పదవులకు సిఫార్సు చేయడంపై తెలుగు తమ్ముళ్లు గుర్రుమంటున్నారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పదవికి కణమాం గ్రామానికి చెందిన ఆబోతు అప్పలరాము పేరును ప్రతిపాదిస్తూ పంపారన్న సమాచారంతో టిడిపి కేడర్ అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. 2019లో వైసిపిలో ఉంటూ, అప్పటి అప్పటి ప్రభుత్వంతో పనిచేసి, టిడిపిలోకి వలసొచ్చిన నేత ఇక్కడ పదవి కోసం పాకులాడడం, దానికి ప్రతిపాదనలు చేయడంపై స్థానిక తెలుగు తమ్ముళ్లకు మింగుడు పడడం లేదు.

2000 నుంచి కార్యకర్తగా, 2014-19 కాలంలో ఎంపిటిసిగా ఉంటూ,. ప్రస్తుతం ఆనందపురం యూనిట్ -1ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న లోడగలవానిపాలేనికి చెందిన లొడగల వెంకట్రావును పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా నియమించాలని పలువురు నాయకులు ఎమ్మెల్యే గంటా దృష్టికి తీసుకువెళ్లారు. అయితే వెంకటరావును విస్మరించడంపై అసంతృప్తిగా ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి తొలి ప్రాధాన్యతనివ్వడంపై మండిపడుతున్నారు. మొదటి నుంచి పార్టీని అట్టిపెట్టుకుని నిబద్ధతతో పనిచేసిన వారికి, కష్టకాలంలో వెన్నంటే ఉన్న వారిని విస్మరిస్తే పార్టీలో ముసలం ఏర్పడడం ఖాయమని, ఎమ్మెల్యే గంటాతోపాటు పార్టీ అధిష్టానం దీన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నారు.

పొగాకుకు స్వస్తితో నోటి కేన్సర్ దూరం

'అపోలో'లో ఓరల్ కేన్సర్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్ ప్రారంభం

ప్రజాశక్తి - ఆరిలోవ : పొగాకు వినియోగమనేది వ్యక్తిగత అలవాటు మాత్రమే కాదని. ఇది జాతీయ ఆరోగ్య సంక్షోభమని ఆరిలోవ అపోలో కేన్సర్ వైద్యులు అన్నారు. శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆరిలోవ అపోలో ఆసుపత్రిలో నోటి కేన్సర్‌పై అవగాహనా శిబిరం నిర్వహించారు.



నోటి కేన్సర్‌పై అవగాహనలో మాట్లాడుతున్న వైద్యులు

ఈ సందర్భంగా అపోలో సర్జికల్ అంకాలజిస్టులు డాక్టర్ బాలకృష్ణ,డాక్టర్ సుమన్ దాస్,డాక్టర్ వి.ప్రదీప్, డాక్టర్ కే.ధీరజ్ కుమార్, డాక్టర్ ఆదినారాయణ న్యూరో సర్జన్ రాజేష్‌బాబు దేవభక్తుని మాట్లాడుతూ, .ప్రపంచంలో నోటి కేన్సర్ కేసుల్లో దాదాపు మూడింట ఒక వంతు భారతదేశంలోనే ఉన్నాయన్నారు. ఏటా 77వేల కేసులు బయటపడుతుండగా, 52,వేల మరణాలు సంభవిస్తున్నాయిన్నారు. నోటి కేన్సర్ బారిన పడిన వారిలో మనుగడ రేటు కేవలం 50శాతం ఉందన్నారు. అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే ఇది చాలా తక్కువన్నారు. గృహ వినియోగ పొగాకు వ్యయ సర్వే, 2022-23 ప్రకారం, పట్టణ, గ్రామీణ భారతదేశంలో పెరుగుతున్న పొగాకు వినియోగం ఆందోళనకర ధోరణిలో ఉందన్నారు. పాన్, పొగాకు, ఇతర మత్తు పదార్థాలపై ఖర్చు పెరిగినట్టు సర్వేలు వెల్లడించడం విచారకరమన్నారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

ప్రజాశక్తి- వేపగుంట : సింహాద్రి అప్పన్న ఆర్జిత సేవల్లో భాగంగా శుక్రవారం స్వామి నిత్యకల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేసిన అర్చకులు, కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాల వంటి కల్యాణ ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామి ప్రసాదాలను అందజేశారు. అనంతరం స్వామి అంతరాలయ దర్శనం కల్పించారు.

సమ్మర్ క్యాంప్ సర్టిఫికెట్లు అందజేత

సర్టిఫికెట్లు అందజేస్తున్న డాక్టర్ భారతి

ప్రజాశక్తి-ఉక్కునగరం : కొండయ్యవలస బ్లూమీ వర్ల్డ్ ట్యూషన్ కోచింగ్ సెంటర్ సమ్మర్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులకు శుక్రవారం సర్టిఫికెట్స్ అందజేసారు. అగనంపూడి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జె భారతి పాల్గొని, విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అనంతరం 31న ఉద్యోగ విరమణ చేయనున్న డాక్టర్ జె భారతిని ఎడిసి చైర్మన బలిరెడ్డి సత్యనారాయణ, ఓం శాంతి బికే రామకోటి, ట్యూషన్ సెంటర్ కరస్పాండెంట్ కంచిపేట వెంకట్, ప్రిన్సిపాల్ కంచిపాటి త్రివేణి సన్మానించారు.

ఎన్‌సిసి విద్యార్థులకు సర్టిఫికెట్లు

ప్రజాశక్తి-మధురవాడ : విలువైన జీవన నైపుణ్యాలను పెంచుకుని, క్రమశిక్షణతో బలమైన దేశభక్తిని పెంపొందించుకొని మంచి నాయకత్వ లక్షణాలతో జట్టు కృషిపై నమ్మకం కలిగి సమాజ సేవ చేయడమే ఎన్‌సిసి విద్యార్థుల కర్తవ్యమని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గొట్టేటి రవి అన్నారు. శిక్షణ ముగించుకున్న విద్యార్థులకు శుక్రవారం ఎన్‌సిసి. కాడెట్ సర్టిఫికేట్‌లను అందజేశారు..ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్‌సిసి. క్యాడెట్ అంటే పౌర సమాజంలో తిరిగే భారత సైన్యమని, తోటివారికి సమాజంలో విలువలు, పద్ధతులు, నిబంధనలు, దేశభక్తి, ఆపదలో ఉన్న వారికి సాయపడడం వంటి లక్షణాలు నేర్పించే బాధ్యత కలిగినవారన్నారు. కాలేజీ చదువులలో కూడా ఎన్.సిసి శిక్షణ కొనసాగించాలని సూచించారు. ఎన్‌సిసి టీచర్ పిఎన్. తులసి ఆధ్వర్యంలో క్యాడెట్లు మాస్ పరేడ్ నిర్వహించారు. పీడీ ఎ.నాగమణి, సిఆర్‌పి. రాంబాబు పాల్గొన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకు అభినందన



కనకేశ్వరరావును అభినందిస్తున్న రఘువర్మ

ప్రజాశక్తి- తగరపువలస : ఉపాధ్యాయునిగా, ఎల్‌ఎఫ్‌ఎల్,హెచ్‌ఎంగా ఎల్ కనకేశ్వరరావు విధి నిర్వహణలో చూపిన అంకితభావం, నిబద్ధత స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు కొనియాడారు.భీమిలి మండలం, మజ్జివలస మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎల్‌ఎఫ్‌ఎల్, హెచ్‌ఎం కనకేశ్వరరావు ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్ర వారం స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో అభినందన సభ నిర్వహించారు. విశ్రాంత హెచ్ ఎం, పొట్నూరు మురళీ మోహన రావు అధ్యక్షతన జరిగిన సభలో మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ మాట్లాడుతూ, కనకేశ్వరరావు మాస్టారు సేవలను కొనియాడారు. ఎంఇఒలు శివరాణి, జయప్రద, వివిధ సంఘాల ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విజ్ఞానదాయకంగా విసిసి సమ్మర్ క్యాంపు

ప్రతిభ చూపిన వారికి బహుమతులిస్తున్న విసిసి ప్రతినిధులు

ప్రజాశక్తి- ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ (విసిసి) ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్ శుక్రవారం మొదటిరోజున విజ్ఞానదాయకంగా సాగింది. విద్యార్థులకు ప్రాంతాల వారీగా వివిధ సామాజిక అంశాలపై టీం ఆక్టివిటీ స్కిట్ చేయించారు. మధ్యాహ్నం కార్టూన్ వేయడం, కథ రాయడంపై కార్టూనిస్ట్, రచయిత హరి వెంకటరమణ అవగాహన కల్పించారు. కార్టూన్స్‌తో బాలల హక్కులను వివరించారు. చివరిలో పిల్లలందరితో విభిన్న కొన్ని రకాల సబ్జెక్టులు ఇచ్చి, వాటిపై చిత్రాలు గీయమన్నారు. పిల్లలందరూ బృందాలుగా ఏర్పడి, ఉత్సాహంగా బొమ్మలు గీసారు. తరువాత కథ అంటె ఏమిటి, కథ చెప్పడం, రాయడంపై వివరించారు. జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు పరశురాం పిల్లలు వ్యక్తిగతమైన క్రమశిక్షణపై తెలియజేశారు. విసిసి నాయకులు కె.రమాప్రభ డి శైలజ జాహ్నవి, కల్యాణి, సరోజిని, గుణశంకర్, శశి కుమార్, వర్షిని, దీపిక, బాల, హేమ, అజయ్,అంజలి, దేవి నేతృత్వంలో 200 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని విసిసి జిల్లా కన్వీనర్ కె.సుశీల తెలిపారు.

చిత్రలేఖన పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు

కిశోర వికాసం పరిశీలన

బాలికలతో మాట్లాడుతున్న యునిసెఫ్ ప్రతినిధి

ప్రజాశక్తి- ఆనందపురం: భీమిలి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని గంభీరం, గొంతినవానిపాలెం అంగన్వాడీ కేంద్రాలను యునిసెఫ్ ప్రతినిధి మేరీ జోన్స్ సందర్శించారు. ఆయా కేంద్రాల్లో కిశోరి వికాసం అమలు తీరును పరిశీలించారు. కిశోర బాలికలతో ప్రత్యక్షంగా చర్చించి, వారు నేర్చుకుంటున్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 2 నుంచి వచ్చేనెల 10 వరకు నిర్వహించనున్న కిశోరి వికాసం అమలుతీరును ప్రశంసిస్తూ, బాలికల అభివృద్ధికి ఇది ఎంతో దోహదపడుతోందని అభిప్రాయపడ్డారు. దీనిద్వారా బాలికల్లో ఆరోగ్య శిక్షణ, వ్యక్తిత్వ వికాసం, లైంగిక విద్య, మాతాశిశు పోషణ, హక్కులు, భద్రత, బాధ్యతలు, ఇతర సామాజిక అంశాలపై అవగాహన పెంపొందుతందున్నారు. కార్యరకమంలో సిడిపిఒలు శ్రీలత, ఎం.శ్రీదేవి, ఐసిపిఎస్ ప్రతినిధి మమత, సూపెర్వైజర్లు పివివి. రత్నం బి. సరిత, ఎంఎస్‌కెలు, ఎఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

నేడు నాగేశ్వరరావు ఉద్యోగ విరమణ

పక్కి నాగేశ్వరరావు, లీలావతి దంపతులు

ప్రజాశక్తి - మాధవధార : విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డ్‌లో ఇసిఇ డిపార్ట్‌మెంట్‌లో ఛార్జిమెన్‌గా విధులు నిర్వర్తించిన పక్కి నాగేశ్వరరావు ఈనెల 31న శనివారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. బీహార్‌లో జన్మించిన నాగేశ్వరరావు ప్రాథమిక విద్యాభ్యాసం, ఇంటర్మీడియట్ (ఎంపీసీ) బొబ్బిలిలో పూర్తి చేశారు. అనంతరం ఎంఎ చదువుకున్న నాగేశ్వరరావు, విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డ్‌లో 1987లో ఎస్‌కెగాగా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించి, ప్రస్తుతం ఛార్జిమ్యాన్‌గా ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఉద్యోగ నిర్వహణలో అంకిత భావంతో పనిచేయడంతో పాటు నావెల్ డాక్‌యార్డ్ అభివృద్ధికి విశేష కృషి చేశారు. కార్మికుల పక్షాన అనేక పోరాటాలు నిర్వహించి, ట్రేడ్ యూనియన్‌కు నాయకత్వం వహించి పలు పోరాటాల్లో కీలకపాత్ర పోషించారు. ఆయనకు భార్య లీలావతి, కుమార్తె తనూజ శ్రావణి, కుమారుడు సాయి పట్నాయక్ ఉన్నారు.

కాన్ఫిడ్రేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా, ఆల్ ఇండియా నేవల్ టెక్నికల్ సూపర్వైజర్స్ అసోసియేషన్ అడిషనల్ జాయింట్ సెక్రటరీగా ప్రస్తుతం బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో నావెల్ సివిలియన్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా, కోశాధికారిగా, జెసిఎం ఫోర్త్ లెవెల్ సభ్యునిగా, సిఐటియు విశాఖ జిల్లా కమిటీ సభ్యునిగా, ఐఎన్‌సిఇ యూనియన్ కార్యవర్గసభ్యునిగా అనేక పోరాటాలకు నేతృతం వహిం చారు. ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా పక్కి నాగేశ్వ రరావుకు పలువురు కార్మికసంఘాల నాయకులు శుభాకాం క్షలు తెలిపారు.ఉద్యోగ విరమణ తర్వాత భవిష్యత్తులో మరిన్ని పోరాటాలకు నేతృత్వం వహించాలని ఆకాంక్షించారు.

36 ఏళ్ల నిర్విరామ సేవలకు విరామం

నేడు బాలశౌరి ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఆర్‌ఎస్‌అండ్‌ఆర్‌ఎస్ విభాగంలో ఫోర్‌మెన్‌గా ఉద్యోగబాధ్యతలు నిర్వర్తిస్తున్న కె.బాలసౌరి ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. 1965, మే 15న ఖమ్మం జిల్లా కల్లాడ మండలం అన్నారిగూడెంలో కనకమ్మ, శామ్యూల్ దంపతులకు జన్మించిన బాలశౌరి, 10వ తరగతి వరకు కల్లాడలోనూ, ఇంటర్ విద్యను ఏన్కూరులోనూ, ఐటిఐ ఖాజీపేటలో పూర్తి చేశారు. బిఎ, ఎంబిఎ, ఐఆర్‌పిఎం కోర్సులను ఆంధ్రా యూనివర్సిటీ నుంచి దూరవిద్యావిధానంలో చదువుకున్నారు. 1989 ఫిబ్రవరి 21న విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగంలో చేరిన బాలశౌరి 36ఏళ్ల పాటు నిర్విరామంగా సేవలు అందించారు.. 1991లో సిఐటియులో చేరారు.1995 నుండి 2012 వరకు ఆర్‌ఎస్‌అండ్‌ఆర్‌ఎస్ విభాగం అధ్యక్షులుగా పనిచేశారు. 2014 నుంచి నేటివరకు అదే విభాగంలో సెక్రటరీగా కొనసాగుతున్నారు. 2018-21 వరకు సిడబ్ల్యూసి-1లో అంబేద్కర్ కళాక్షేత్రానికి ట్రెజరర్‌గా పనిచేశారు. 2021-22 వరకు అంబేద్కర్ కళాక్షేత్రానికి

బాలశౌరి, విమల దంపతులు

సెక్రటరీగా వ్యవహరించారు. తనహయాంలోనే అంబేద్కర్ కళాక్షేత్రాన్ని పలు విభాగాల్లో అభివృద్ధి చేసిన బాలశౌరి, కళాక్షేత్రంలో హాల్, ఎసిలు, డోర్‌లు ఏర్పాటు చేశారు. అంబేద్కర్ విగ్రహానికి అర్చిలు నిర్మించారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని అన్ని సెక్టార్లలోనూ ఆటలు పోటీలు. నిర్వహించారు. బాలశౌరి భార్య కె.విమల 2007 - 12 వరకు అప్పటి 54వ వార్డుకు కార్పొరేటర్‌గా వ్యవహరించి అనేక సేవా కార్యక్రమాలు చేప్టారు. పేదలకు ఇళ్లు మంజూరు చేయించారు. వీరికి ఇద్దరు కుమార్తెలు డాక్టర్ కావ్య, శ్రావ్య ఉన్నారు.

కెజియా సేవలు ప్రశంసనీయం

- 18 ఏళ్లకే ప్రభుత్వ ఉద్యోగం
- 42 ఏళ్లపాటు విద్యాబోధన
- నేడు ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి-ఆనందపురం : 18ఏళ్ల చిన్నవయస్సులోనే ప్రభుత్వ ఉద్యోగంలో చేరి, 42ఏళ్లపాటు గణిత శాస్త్ర ఉపాధ్యాయురాలిగా తన అమూల్య సేవలతో బోధనారంగంలో విశిష్ట స్థానాన్ని సంపాదించిన యార్లగడ్డ ప్రతాప్ కెజియా శనివారం ఉద్యోగవిరమణ చేయనున్నారు. విద్య, ఆధ్యాత్మికత, కుటుంబ జీవితం ఇలా అన్నింటిలోనూ సమతుల్యతతో ఆమె జీవన యానం నేటి తరానికి ఆదర్శప్రాయమని చెప్పాలి.

1965 జనవరి 14న యార్లగడ్డ భూషణం, సరోజిని ఉపాధ్యాయ దంపతులకు జన్మించిన కెజియాకు ఇద్దరేసి సోదరీ, సోదరులు. 1991లో డాక్టర్ కూర్మాన ప్రేమానంద్‌తో వివాహమైంది. చిన్ననాటి నుంచే బోధన పట్ల ఆసక్తితో, యుక్త వయసులోనే ఉపాధ్యాయ వృత్తిలో అడుగుపెట్టారు. 1983లో క్వీన్ మెరీన్ ప్రభుత్వ పాఠశాలలోఎస్‌జిటిగా ఉపాధ్యాయ ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించిన కెజియా, తర్వాత డైట్ మోడల్ స్కూల్, చిట్టివలస, వెల్లంకి, ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గణిత శాస్త్ర ఉపాధ్యాయురాలిగా అత్యుత్తమ సేవలు అందించారు. బిఎస్‌సి, ఎంఎస్‌సి (మ్యాథ్స్), ఎంఎ

కెజియా, ప్రేమానంద్ దంపతులు

ఇంగ్లీష్, టిటిసి, బిఇడి, ఎంఇడి వంటి పలు విద్యార్హతలతో తన విద్యానుభవాన్ని వృద్ధి చేసుకున్నారు. గణిత రిసోర్స్‌పర్సన్‌గా ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చారు. మండల, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎన్నుకోబడ్డారు. రోటరీ క్లబ్, ఇంజినీరింగ్ విద్యార్థులు, గ్రామస్థులు, జిల్లా కలెక్టర్ ఇలా పలువురితో అవార్డులు, రివార్డులు, ప్రశంసలు అందుకున్నారు. ఉద్యోగసేవలతో పాటు, ధార్మిక కార్యకలాపాల్లో నిబద్ధతతో పాల్గొంటూ, సండే స్కూల్ సూపరింటెండెంట్ గా సేవలందించారు. కుటుంబంతో ఆనందపూర్ణమైన జీవనాన్ని సాగిస్తున్న కెజియా కుమారుడు శ్యాంసన్ డేటా సైంటిస్ట్, కుమార్తె, షారోన్ మౌనిక డిజైన్ ఇంజినీర్, కోడలు ప్రీతి షారోన్ వెబ్ డిజైనర్, అల్లుడు శ్రీరాజ్ డేటా అనలిస్ట్‌గా సాంకేతిక రంగాల్లో తమ ప్రతిభను చాటుతున్నారు.

నేడు మువ్వల వెంకటరమణ ఉద్యోగ విరమణ

మువ్వల వెంకటరమణ

ప్రజాశక్తి- గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఎలక్ట్రికల్. విభాగంలో సీనియర్ మేనేజర్‌గా విధులు నిర్వర్తించిన మువ్వల వెంకటరమణ ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. 1965 ఆగస్టు 23న విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం పిరిడి గ్రామంలో జన్మించిన వెంకటరమణ, ఐదో తరగతి వరకు పిరిడిలోని స్పెషల్ సమితి ప్రాథమిక పాఠశాలలోనూ, ఆరోతరగతి నుంచి 10వ,తరగతి అదే గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివారు. 1980-83లో గుంటూరు జిల్లా నల్లపాడులోనిమద్దిపాల త్రిపుర సుందరమ్మ ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో డిప్లమా ఇన్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ చదువు పూర్తిచేశారు. 1988 మార్చి 5న రమాదేవిని వివాహం చేసుకున్నారు.

ఉద్యోగప్రస్థానం : చిలకలపల్లి, బలిజిపేటలోని1983లో గాంధీ మెమోరియల్ లెప్రసి ఫౌండేషన్‌లో క్యాప్ స్టడీ మ్యాన్‌గా పనిచేశారు. 1985-86లో హైదరాబాదు పటాన్‌చెరువులో సిపిసి ఫార్మాసిటీలో షిఫ్ట్ ఎలక్ట్రిషన్ గా పనిచేశారు. 1986-88లో బొల్లారంలోని ఆర్‌ఆర్ ఫాస్టనర్స్ లిమిటెడ్ కంపెనీలో ఎలక్ట్రికల్ సూపర్వైజర్‌గా పనిచేశారు. తర్వాత 1988 నవంబర్ 15న విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగంలో చేరిన వెంకటరమణ అంచెలంచెలుగా ఎదిగి ఎలక్ట్రికల్ విభాగంలో సీనియర్ మేనేజర్ ఉద్యోగ విరమణ చేయనున్నారు. వెంకటరమణకు ఇద్దరు సంతానంకాగా, కుమార్తె పూర్వి, కుమారుడు గోపాల్‌రాహుల్ ఉన్నారు.

ప్రత్యేకాంశాలు : క్వాలిటీ సర్కిల్స్‌లో రెండుదఫాలు జాతీయ స్థాయిలో టీమ్‌లీడర్‌గా ఎక్సలెన్సీ అవార్డు సాధించారు. కాలుష్య నివారణకు యరత్ర సామాగ్రి సమర్థవంతంగా నిర్వహించినందుకు గ్రీన్ అవార్డు కైవసం చేసుకున్నారు.

ప్రవత్తి : పద్యనాటక రంగం, నటన, గానం, రచనా వ్యాసంగం, నాటక పరిషత్ పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. 'మువ్వల సడి' పద్యనాటక సాహిత్య విశ్లేషణ వాట్సాప్ సమూహ నిర్వహణ, 50పైచిలుకు పరిషత్ నాటక పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతుల కైవసం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ కందుకూరి విశిష్ట పురస్కారాన్ని గతనెల 16న రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ నుంచి అందుకున్నారు.

బిక్కుబిక్కుమంటూ విధుల నిర్వహణ

★ శిథిలావస్థలో తహశీల్దార్ కార్యాలయం
★ కారిపోతున్న భవనం
★ తడిసిపోతున్న రికార్డులు
★ పురాతన భవనంలో రెవెన్యూ సేవలు
★ ప్రమాదపుటంచున పౌరులు, ఉద్యోగులు

ప్రజాశక్తి అనకాపల్లి రూరల్

ఎక్కడైనా ప్రమాదం జరిగితే అంచనా వేసేది, బాధితులకు పరిహారం చెల్లించేది రెవెన్యూ అధికారులే. అలాంటి రెవెన్యూ అధికారులు సేవలందించే కార్యాలయం శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలిపోతుందో తెలియని స్థితిలో ఉంది. కార్యాలయంలో పని చేసే ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తుండగా, తహశీల్దారు ఆఫీసుకు వివిధ పనులపై వచ్చే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మరోపక్క వాన వస్తే కారిపోయి ప్రజల ఆస్తులకు సంబంధించిన రికార్డులు కూడా తడిసి పాడైపోయే పరిస్థితి ఉంది.

అనకాపల్లి తహశీల్దార్ కార్యాలయానికి 150 ఏళ్ల చరిత్ర ఉంది. బ్రిటిష్ వారి కాలంలో నిర్మించిన ఈ భవనం నేటికీ సేవలు అందిస్తోంది. పురాతన భవనం కావడంతో శిథిలావస్థకు చేరింది. గతంలో వానొస్తే మూడు అడుగులు మేరకు నిండిన నీటిలోనే ఉద్యోగులు కూర్చునేవారు. ఐదేళ్ల కిందటి నాటి పరిస్థితి ఇది. అప్పటి తహశీల్దారు పాండురంగారెడ్డి ఫ్లోరింగ్‌ను ఎత్తు పెంచడంతో పాటు గచ్చును అభివృద్ధి చేశారు. దీంతో ఆ సమస్య తగ్గింది. భవనంలోనే మర్రి చెట్లు పెరిగి దాని ఊడలు భవనం లోపలకు చొచ్చుకొచ్చాయి. పెంకులు పైకప్పు గల ఈ భవనం పైకప్పుతో పాటు భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. పూర్తిగా శిథిలావస్థలో ఉన్న భవనంలోనే ప్రస్తుతం రెవెన్యూ సేవలు సాగుతున్నాయి.

వానొస్తే భవనమంత కారిపోయి తడిసి ముద్దవుతుంది. ఇదే సందర్భంలో ప్రజా ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు ఉంచే రికార్డు రూమ్ తడిసిపోయే ప్రమాదం కనిపిస్తుంది. అటు ఉద్యోగులు సైతం ఆందోళనకు గురవుతున్నారు. పౌర సేవల నిమిత్తం రోజుకు వందలాదిమంది ప్రజలు ఇక్కడికి వస్తుంటారు.

శిథిలావస్థలో ఉన్న తహశీల్దారు కార్యాలయం ఇదే..

చెట్టు ఊడలు మొలిచిన రికార్డుల గది

ఎప్పుడైనా ప్రజా ప్రతినిధులు కూడా వచ్చే అవకాశం ఉంటుంది. మరి అనుకోకుండా అనుకోని సందర్భంలో ఎప్పుడైనా ప్రమాదం సంభవిస్తుందేమోనని ఉద్యోగులు భయంభయంగా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నూతన భవనం నిర్మాణం చేయాలని పలువురు కోరుతున్నారు.

రికార్డులకు భద్రత లేదు

శతాబ్దం నాటి భవనంలోనే రెవెన్యూ సేవలు కొనసాగుతున్నాయి. నిత్యం అనేక మంది ఇక్కడికి వస్తారు. ప్రభుత్వ కార్యాలయం కూలిపోయి ఎవరికైనా ఏమైనా జరిగితే పరిస్థితి ఏమిటీ? విలువైన రికార్డులు సైతం పాడైపోతున్నాయి. రెవెన్యూ కార్యాలయానికి కొత్త భవనం నిర్మాణం చేసే యోచన చేస్తే మంచిది.

- ఎస్.రమణ అప్పారావు, అనకాపల్లి

పిల్లలకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : శ్రీవిష్ణు హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం అచ్యుతాపురంలో క్రీడాకారులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 60 మంది పిల్లలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. శిబిరానికి విచ్చేసిన వైద్యులు ఏ సుధీర్, మౌనిక, సత్య దంత సంరక్షణ తదితర విషయాలపై క్రీడాకారులకు అవగాహన కల్పించారు. ప్రతిరోజు రెండు పూటలా బ్రష్ చేయాలని చెప్పారు. ఏదైనా ఆహార పదార్థం తీసుకున్న అనంతరం నోట్లో నీళ్ల వేసుకుని పుక్కాలించుకోవాలని సూచించారు. పిల్లలకు వయసుకు తగ్గ ఎత్తు, బరువు ఉన్నారా అని చెక్ చేసి మానవ శరీరానికి కావలసిన పౌష్టిక ఆహారాలను అందించాలని సూచించారు. హెయిర్ గురించి తలకి రాత్రి నూనె రాసుకుని ఉదయాన్నే తలంటి స్నానం చేయాలన్నారు. వేసవిలో పిల్లలు ఎండలో తిరగకుంట నీడ పట్టున ఉండాలని సూచించారు. ఈ శిబిరంలో ముఖ్యంగా డెంటల్, స్కిన్, హెయిర్, బిఎంఐ (బాడీ మజిల్ ఇండికేటర్) పరీక్ష చూసి వాటికి సంబంధించిన మౌత్ వాస్, టూత్ పేస్ట్, బ్రెస్ ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమం విఆర్ సమ్మర్ కోచ్ వెంకట్, కూండ్రపు నాయుడుబాబు, ఉమాశంకర్, కోచ్ మచ్చ సుబ్రహ్మణ్యం, పాల్గొన్నారు.

వినతిపత్రాలు స్వీకరిస్తున్న పీలా గోవింద సత్యనారాయణ

అర్హులందరికీ టిడ్కో గృహాలు : పీలా

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : ప్రభుత్వానికి డీడీలు కట్టిన అర్హులందరికీ టిడ్కో గృహాలు ఇవ్వడం జరుగుతుందని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ తెలిపారు. టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్ కార్యక్రమంలో ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ శ్రేణులు, ప్రజల సమస్యలను పరిస్కరించేందుకే ప్రతి శుక్రవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తున్నామని చెప్పారు. విదేశీ విద్య కోసం ఆర్థిక సహాయం చేయాలని కోరగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. గ్రామాలలో వీధి లైట్లు కోసం విజ్ఞప్తి చేయగా విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సబ్బవరపు గణేష్, ఏఎంసి చైర్మన్ పచ్చికూర రాము, జిల్లా ఉపాధ్యక్షులు బిఎస్ఎంకె జోగి నాయుడు, తలారి కాశీ నాయుడు పాల్గొన్నారు.

అవినీతిపరునికి టిడిపి మండల అధ్యక్ష పదవి ఇవ్వొద్దు

ప్రజాశక్తి - వడ్డాది

అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమాలకు పాల్పడుతున్న రావికమతం మండల టిడిపి అధ్యక్షుడు రాజాన కొండనాయుడుకు, వారి కుటుంబ సభ్యులకు మళ్లీ టిడిపి మండల అధ్యక్ష పదవి ఇవ్వవద్దని రావికమతం గుడివాడ పంచాయతీ టిడిపి నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబును వడ్డాదిలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం మాజీ సర్పంచ్ బర్నికాన అప్పారావు స్థానిక విలేకరులతో మాట్లాడారు. కొండనాయుడు ఇప్పటికే నాలుగు దఫాలు రావికమతం మండల టిడిపి అధ్యక్షుడిగా పని చేశారని, మూడుసార్లు పైబడి చేసినవారిని తప్పించి కొత్తవారికి అవకాశం ఇవ్వాలని టిడిపి అధిష్టానం నిర్ణయించడంతో ఈ దఫా వారి సతీమణి రాజాన వాణికి ఆ పదవి ఇప్పించేందుకు కొండనాయుడు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. కొండ నాయుడు పార్టీ ప్రయోజనాల కంటే తన వ్యక్తిగత స్వార్థానికి ఎక్కువగా పని చేస్తున్నారని ఆరోపించారు. రెవెన్యూ, ఇతర అధికారులను గుప్పెట్లో పెట్టుకుని భూ కబ్జాలకు పాల్పడుతున్నారని, వివాదాస్పద భూముల సెటిల్మెంట్లు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. పార్టీ ప్రయోజనాల కోసమే కొత్తవారికి అవకాశం ఇవ్వాలని తావము కోరుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు సత్తిబాబు సూరిబాబు, అప్పన్న, రాజు నాయుడు, నాగేశ్వరరావు, బాబురావు, తదితరులు పాల్గొన్నారు.



తాతయ్యబాబుకు వినతిపత్రం అందిస్తున్న గుడివాడ నాయకులు

అధ్వానంగా ప్రధాన రహదారి

- గోతులు పూడ్చాలని స్థానికుల డిమాండ్

గోతుల్లో వర్షపు నీరు చేరడంతో చెరువును తలపిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కశింకోట : తాళ్లపాలెం-నర్సీపట్నం రోడ్డులో కసింకోట మండలం తాళ్లపాలెం సంత వద్ద గోతులతో రహదారి అధ్వానంగా ఉంది. చిన్నపాటి వర్షానికి కాలువను తలపించే విధంగా నీరు నిల్వ ఉండిపోతుంది. ఇక్కడ గతంలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడగా నాలుగు నెలల క్రితం మరమ్మతులు చేశారు. కాని మూడు చోట్ల యథాతథంగా గోతులు ఏర్పడ్డాయి. నాగేశ్వరరావు ఇంటిముందు మరో రెండు చోట్ల రోడ్‌లో గోతులు ఏర్పడ్డాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ రోడ్డు దుస్థితి ఇలా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధత అధికారులు స్పందించి గోతులను పూడ్చి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని పలువురు వాహన దారులు, స్థానికులు కోరుతున్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత

సిఎం సహాయ నిధి చెక్కు అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అంతకాపల్లి గ్రామానికి చెందిన వెన్నెల నాయుడికి మెరుగైన చికిత్స కోసం సీఎం సహాయ నిధి నుంచి రూ. 30,786 వేల రూపాయలు మంజూరయ్యాయి. దీనికి సంబంధించి చెక్కును పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ఆదేశాల మేరకు సబ్బవరం జనసేన పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు కర్రి కనకరాజు, మండల టిడిపి మాజీ అధ్యక్షుడు మిడతాడ మహాలక్ష్మి నాయుడు ఆధ్వర్యంలో వెన్నెల నాయుడు కుటుంబ సభ్యులకు రూ.30786 వేలు చెక్‌ను శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మామిడి లక్ష్మి కొండాజీ, జనసేన నాయకులు బంతి కోళ్ల పద్మ, గొర్లి నూకరాజు, కర్రి నరసింగరావు, తాటిపాముల శేఖర్, సబ్బవరపు రమణ, పల్లా రమణ, సబ్బవరపు నాయుడు, జెట్టి ప్రసాదు, పల్లి మంగరాజు, వాకాడ తేజ, జెట్టి అప్పలరాజు, వాకాడ సత్తిబాబు, మండల జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న మే పుష్పాలు

ప్రజాశక్తి-మునగపాక : మండల కేంద్రం మునగపాకలో మే పుష్పాలు పలువురిని ఆకట్టుకుంటున్నాయి. గ్రామానికి చెందిన పెంటకోట అప్పలనాయుడు, పెరట్లో మే పుష్పాలు వికసించాయి. మే నెలలో మాత్రమే వికసించే ఈ పువ్వులు ఒక వారం రోజులు వరకు వెలిసే ఉంటాయని వారు తెలిపారు. అప్పలనాయుడు బంధువైన ఉద్యానవన శాఖ ఉద్యోగి మే పువ్వుల మొక్కను బహుకరించగా, వాటిని పెరటిలో పెంచినట్లు చెప్పారు. ప్రతి సంవత్సరం మే నెలలో వికసించే మే పువ్వులను చూపరును విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.



అప్పలనాయుడు పెరటిలో వికసించిన మే పుష్పాలు

పశు దాణా అందిస్తున్న సర్పంచ్ లక్ష్మి తదితరులు

రైతులకు రాయితీపై దాణా పంపిణీ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : ప్రభుత్వం రాయితీపై మంజూరు చేసిన పశువుల దాణాను శుక్రవారం బుచ్చెయ్యపేట పశువుల ఆసుపత్రి వద్ద స్థానిక సర్పంచ్ సుంకర లక్ష్మి రైతులకు పంపిణీ చేశారు. ప్రభుత్వం 50 శాతం రాయితీతో దాణాను మంజూరు చేసింది. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి ఉమామహేశ్వరి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

జీడి, మామిడి యాజమాన్య పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి-కశింకోట : మామిడి, జీడిమామిడి సాగులో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి ఉద్యానవన శాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఈ మేరకు మండలంలోని బయ్యవరం రామాలయం వద్ద బిసిటి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా వ్యవసాయ శాఖ వారి సహకారంతో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి జి ప్రభాకర్ మాట్లాడుతూ కాపు కోసిన తర్వాత మామిడి, జీడిమామిడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. డిఆర్సి సహాయ వ్యవసాయ సంచాలకులు సిహెచ్ సుబ్రహ్మణ్యం వరి సాగు గురించి నారు మడి యాజమాన్యం గురించి తెలియజేశారు. మండల వ్యవసాయ శాఖ అధికారి స్వప్న మాట్లాడుతూ పచ్చ రొట్టె ఎరువుల విత్తనాలు దగ్గరలో ఉన్న రైతు సేవ కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వివిధ రకాల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ పథకాల గురించి వివరించారు. మండల ఉద్యాన విస్తరణ శాఖ అధికారి ప్రవీణా మాట్లాడుతూ కొబ్బరి, మామిడి మొక్కలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. బిసిటి కృషి విజ్ఞాన కేంద్రం భూసార శాస్త్రవేత్త బి శ్రీహరిరావు మట్టి ఆరోగ్య పరిరక్షణ గురించి, సహజ ఎరువుల వాడకం గురించి రైతులకు వివరించారు పశు వైద్య శాస్త్రవేత్త డాక్టర్ విజయ రాజ్ఞి పశు గ్రాస సాగు గురించి, వానా కాలంలో పశువుల పరిరక్షణ గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : కల్లుగీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యాన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ అధికారికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రా దేముడు మాట్లాడుతూ ప్రమాదవశాత్తు చెట్టు మీద నుండి పడి చనిపోయిన కల్లుగీత కార్మికుని కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. అర్హత కలిగిన కల్లుగీత కార్మికులకు అనకాపల్లి జిల్లా పేరు మీద గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. తాడి గ్రామాన్ని ప్రభుత్వం తరలిస్తున్నందున ఆ గ్రామంలోని కల్లుగీత సహకార సంఘం సభ్యులకు ఉపాధి అవకాశాలు కలిపించాలని, కార్మికులకు తాడి చెట్లు, ఈత చెట్లు కేటాయించాలని కోరారు. అనాధికార బ్రాందీ, బెల్ట్ షాపులను రద్దు చేయాలన్నారు. గ్రామాల్లో గ్రామ సర్పంచ్, విఆర్ఎ, సచివాలయం పోలీసు సిబందితో కమిటీ వేసి అనధికార బెల్టుషాపులను పెట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బెల్టుషాపులు పెట్టిన గ్రామాల పంచాయతీ సర్పంచ్‌లకు చెక్కు పవర్ రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బత్తిన నాగేశ్వరరావు, కర్రి అప్పలకొండ, జాతిక రాము, కాకర సుభరావు, గండిబోయిన అప్పారావు, కాకర ఈశ్వరరావు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న కల్లుగీత కార్మిక సంఘం నాయకులు

యోగాతో ఆరోగ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి

యోగా వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రశాంతంగా జీవిస్తారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం శాంతిప్రభ అన్నారు. యోగాంధ్ర-2025 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో ఉదయం 7 నుండి 9 గంటల వరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులు యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా గురువుల పర్యవేక్షణలో యోగాసనాలు వేశారు. అనంతరం యోగపై అవగాహన ర్యాలీ రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం నుండి ఎన్‌టిఆర్ జిల్లా ఆసుపత్రి వరకు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ కె.లావణ్య జిల్లా లెప్రసీ అధికారి బాలాజీ, నర్సీపట్నం ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె.వీరజ్యోతి, జాతీయ ఆరోగ్య మిషన్ జిల్లా అధికారి ప్రశాంతి, జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి చంద్ర శేఖర్ దేవ్, ఆర్ఎంఓ గౌతమ్, ఎన్‌టిఆర్. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు పాల్గొన్నారు.

స్థానిక గౌరీ గ్రంథాలయంలో అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ సర్కిల్ సూపరిండెండింగ్ ఇంజనీర్ జి ప్రసాద్ ఆధ్వర్యంలో సుమారుగా 100 మంది ఉద్యోగులకు అనకాపల్లి యోగాలైఫ్ టీచర్ కరణం రమాదేవి, ఈశ్వరరావు శిక్షణ ఇచ్చారు. వివిధ రకాల ఆసనాలు గురించి వివరించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఉద్యోగులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శుక్రవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ మంగతాయారు, మండల ఇంజనీరింగ్ అధికారి పి.సుమతి, పరిపాలనాధికారి ఎస్.అప్పలరాజు, ఈవోపిఆర్‌డి రమణి, ఎంఈఓ-1 కె.సత్యనారాయణ, ఐసిడిఎస్ సూపర్వైజర్లు సుశీల, కళ్యాణి, రాములమ్మ, ఆదిలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నక్కపల్లి : యోగాంధ్రాను ఉద్యోగులు విజయవంతం చేయాలని తహసిల్దార్ నరసింహమూర్తి, ఎంపీడీవో సీతారామరాజు కోరారు. మండలంలోని ఉపమాక వెంకన్న ఆలయ ప్రాంగణంలో నాలుగవ రోజు శుక్రవారం యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్, ఎంపీడీవో పాల్గొని మాట్లాడారు. యోగాంధ్ర 2025 పై ఉద్యోగులు ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే ఇబ్బందులు పడాల్సి వస్తుందని హెచ్చరించారు. సచివాలయ ఉద్యోగులంతా గ్రామాల్లో ఒక్కొక్కరూ 50 మందికి శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి కె.రఘు, యోగా గురువులు డీఎన్‌వీ సాయి, దవరసింగి రాంబాబు, యోగా మాస్టర్ ట్రైనర్లు ఎన్‌వీఎస్ ఆచార్యులు, ఆదిత్య రుత్విక్, సీడీపీవో శ్రీ విద్య పాల్గొన్నారు.

కోటవురట్ల : మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగా శిక్షణ తరగతులు నాలుగవ రోజు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, పిఓపిఆర్డి రఘురాం, సచివాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తగరపువలస : చిట్టి వలస జెడ్పి హైస్కూల్లో విద్యార్థులకు శుక్రవారం యోగా, క్విజ్ పోటీలు నిర్వహించారు. క్విజ్ పోటీల్లో విద్యార్థులు వర్షిత, తన్మయి, ఆర్షిత్, సాయి, భవదీప్ ప్రతిభ కనబరిచిన ట్లు నిర్వాహకులు తెలిపారు కార్యక్రమంలో ఆయుష్ వైద్యులు డాక్టర్ ప్రతిభ, హెచ్ఎం ఎన్ సూర్య నారాయణ, పిఇటి వెంకటరెడ్డి, సిఆర్‌పి త్రినాథ్, సమగ్ర శిక్ష పిఇటిలు మేరీ గోల్డ్, పద్మావతి, ఎస్ఎంసి సభ్యులు పాల్గొన్నారు

కె.కోటపాడులో యోగా శిక్షణలో పాల్గొన్న అంగన్వాడీలు

కోటవురట్లలో యోగా చేస్తున్న ఉద్యోగులు

యోగా దినోత్సవానికి 10 వేల మంది సమీకరణ : కలెక్టర్

ప్రజాశక్తి-అనకాపల్లి : విశాఖపట్నం వేదికగా జూన్ 21న జరుగనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పాల్గొంటున్న నేపథ్యంలో అనకాపల్లి జిల్లా నుండి 10 వేల మంది పరిశ్రమల కార్మికులను పంపిస్తున్నట్లు జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ తెలిపారు. యోగాంధ్ర-2025పై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర సచివాలయం నుండి శుక్రవారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి కార్యక్రమాల ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నుండి మూడు జాతీయ రహదారులు ఉన్నాయని, ఆయా మార్గాలలో నిర్దేశించిన ప్రదేశాలకు వారిని తరలించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించుటకు విశాఖపట్నం జిల్లా కలెక్టరుతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

ఖరీఫ్ వరి సాగుకు సన్నద్ధం

-అందుబాటులో పచ్చి రొట్ట విత్తనాలు
-సబ్సిడీపై కొత్త రకం వరి విత్తనాలు పంపిణీ
-ఎరువులు అందించడానికి ప్రణాళికలు
-మండల వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రావు

ప్రజాశక్తి - యలమంచిలి

ఖరీఫ్ వరి పంట సాగుకు మండలంలో రైతులు, వ్యవసాయ అధికార్లు సర్వం సన్నద్ధతతో ఉన్నారని యలమంచిలి మండల వ్యవసాయాధికారి పొలిమేర మోహనరావు చెప్పారు. శుక్రవారం ఏఓ కార్యాలయంలో తనను కలిసిన ప్రజాశక్తికి తాజా వ్యవసాయ కార్యక్రమాల గురించి వివరించారు. ముందస్తుగా తొలకరి ప్రవేశించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇదే అదునుగా వరి పంటకు అవసరమైన నారుమళ్ల సిద్ధం చేసుకోవడానికి సంసిద్ధులౌతున్నారని పేర్కొన్నారు. దీనికి అనుగుణంగా వ్యవసాయ శాఖ వరి పంట వేసే మడుల్లో వేసేందుకు పచ్చి రొట్ట ఎరువు విత్తనాలు 212 క్వింటాళ్ల పంపిణీ చేసిందని, మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఇంకా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులంతా పచ్చి రొట్ట ఎరువుల్ని పెంచుకోవాలని, అవి దమ్ములో కలియ దున్నడం ద్వారా రసాయన ఎరువుల వాడకం తగ్గించవచ్చని చెప్పారు. మండలంలో సాదారణ వరి సాగు 5,432 ఎకరాలు కాగా, అందులో శారద, మైనర్ శారద నదుల

మాట్లాడుతున్న వ్యవసాయాధికారి మోహన్‌రావు

ద్వారా 2,022 ఎకరాలకు సాగునీరు అందతుందని చెప్పారు. మిగిలిన 4,025 ఎకరాలు వర్షాధారం, 432 వ్యవసాయ బోరు బావుల ద్వారా సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు అందించడానికి ప్రణాళిక రూపొందించామని, 1150 టన్నులు ఎరువులకు ఇండెంట్ పెట్టామని చెప్పారు. అవి జూన్ 15, 20 తేదీల నాటికి మండలానికి చేరుతాయన్నారు. వరి కొత్త రకం విత్తనాలు ఎంటియు 1318, 1061 , 1064, 1224 మొదలైన రకాలు రైతులకు సబ్సిడీ ధరలపై అందించనున్నామని చెప్పారు. సకాలంలో ఎరువులు అందుబాటులో ఉంచడానికి ఇప్పటికే ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వివరించారు.

కార్మికులకు బకాయి జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : ఆనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రిలో పని చేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ గార్డ్ కార్మికులకు బకాయి పడ్డ 3 నెలల జీతాలు తక్షణమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్, ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల నుంచి రానున్న సెక్యూరిటీ, శానిటేషన్ నూతన కాంట్రాక్టర్లు ప్రభుత్వం జీవో ప్రకారం కార్మికులకు కనీస వేతనం అమలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వడ్డాది. ఈశ్వరరావు, వెంకట లక్ష్మి, బిఎల్ రాజు, ప్రసాద్, నవీన్, జగన్నాధం తదితరులు పాల్గొన్నారు.

ముస్లిములతో ఎమ్మెల్యే రాజు

మసీదు పునర్నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరు

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం జమ మసీదు పునర్నిర్మాణ పనుల కోసం 30 లక్షల రూపాయలు మంజూరయ్యాయని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. శుక్రవారం జమ మసీదు వద్ద నూతనంగా నిర్మించిన మండప భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018లోని మసీదుకు నిధులు మంజూరు అయ్యాయని, గత ప్రభుత్వం నిధులను ఖర్చు చేయలేదని తెలిపారు. మళ్లీ తన పరిరక్షణలోనే నిధులు ఖర్చు చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ముస్లింలలో అనేక మంది పేదలు ఉన్నారని వారందరికీ సంక్షేమ పథకాలు, రేషన్ కార్డులు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు విషయమై నేరుగా తమ వద్దకు రావచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు జిలాని, టిడిపి చోడవరం టౌన్ అధ్యక్షుడు దేవరపల్లి వెంకట అప్పారావు, సక్కురి కోటేశ్వరరావు, ఎంపీడీవో ఆంజనేయులు, యుపిఆర్టి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని గాలిభీమవరం పంచాయతీ శివారు జాగరవానిపాలెం గ్రామంలో ఇటీవల బడిదబోయిన నూకరాజు అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడు కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకొని జనసేన నాయకులు శుక్రవారం నూకరాజు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం జిల్లా జనసేన పార్టీ సీనియర్ నాయకులు బలిరెడ్డి అప్పారావు ఆర్థిక సహాయంతో సమకూర్చిన 50 కేజీల బియ్యం, 5 వేలు రూపాయలు నగదు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవం

అనకాపల్లిలో జెండాను ఆవిష్కరిస్తున్న లోకనాథం

ప్రజాశక్తి-నక్కపల్లి: నక్కపల్లిలో సిఐటియు కార్యాలయం వద్ద శుక్రవారం రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం అప్పలరాజు ఆధ్వర్యంలో సిఐటియు ఆవిర్భావ దినోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. శ్రీ నూకతాత ఆటో యూనియన్ ఉపాధ్యక్షులు ఇసరపు నాగేశ్వరావు సిఐటియూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అప్పలరాజు, రాజేష్ మాట్లాడుతూ, సీఐటీయూ కార్మిక హక్కుల రక్షణ కోసం కృషి చేస్తుందన్నారు.మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చి కార్మికుల హక్కులకు భంగం కలిగించే విధంగా పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మిక చట్టాలు మార్చుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమం లో నాగు, బుజ్జి, ప్రసాద్, రాజు, తాతాజీ, రాజు పాల్గొన్నారు.

నక్కపల్లిలో...

అనకాపల్లి: సిఐటియు 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం అనకాపల్లి సిఐటియు కార్యాలయం వద్ద సిఐటియు పతాకాన్ని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కె.లోకనాథం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ 1970లో సిఐటియు ఏర్పడిందని ,నాటినుండి నేటివరకు కార్మికుల సమస్యలపై పోరాటాలు చేస్తుందని పేర్కొన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా పనిచేస్తుందని, వారికి లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తుందని పేర్కొన్నారు. మరో వైపు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జులై 9న నిర్వహించే సమ్మెలో కార్మిక వర్గం, ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు, నాయకులు గంట శ్రీరామ్, అడిగర్ల రాజు, రమణ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ ఫార్మాసిటీలో సిఐటియు జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్మికులకు రక్షణగా ఉండే కార్మిక చట్టాలను మార్చి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చి కార్మికుల హక్కులకు భంగం కలిగిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కే రమణ, సత్తిబాబు, జి.చిట్టిబాబు, కే.అప్పలరాజు, శేషు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : అచ్యుతాపురం జంక్షన్‌లో సిఐటియు జెండాను ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, మండల కన్వీనర్ కె సోమునాయుడు ఆధ్వర్యంలో ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు కర్రి నాయుడు, రమేష్, గణేష్, వి.ప్రకాష్, రావాడ శ్రీను, హనుమంతు, ఎ.కొండలరావు పాల్గొన్నారు.

యలమంచిలి : స్థానిక ధర్మవరం వీధి, ఫ్యూజన్ కంపెనీ వద్ద సిఐటియు పతాకాన్ని ఎగురవేసి జేజేలు పలికారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ చింతకాయల శివాజీ మాట్లాడుతూ కార్మికుల పక్షాన నిలిచే సిఐటియుని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమలో సిఐటియు నాయకులు శశికళ, సత్యనారాయణ, చిరంజీవి, లక్ష్మి, కార్మికులు పాల్గొన్నారు.

ములగాడ : కార్మికుల హక్కుల పరిరక్షణకు, సమస్యల పరిష్కారానికి సిఐటియు నిరంతరం పనిచేస్తుందని సిఐటియు విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. శుక్రవారం సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ధనరెడ్డి గోదాముల వద్ద యూనియన్ జెండాను ఆవిష్కరించారు. కార్మికులకు సిఐటియు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు

హెచ్‌పిసిఎల్ గేటు వద సిఐటియు మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో గంటా దాసు, షిప్ యార్డ్ వద్ద సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎస్.ప్రసాద్, 58, 59, 60 శ్రీహరిపురంలో జివిఎంసి కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మల్కాపురం జోన్ అధ్యక్షులు కె. పెంటారావు , 61వార్డు మల్కాపురం ఆఫీసు వద్ద ఉరుకూటి.బాబురావు, ఎం.ఉమా, శ్రీహరిపురం ముఠా కార్మికులు, ధనరెడ్డి గోడౌన్స్, భవన నిర్మాణ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో 40వ వార్డు ఎకెసి కాలనీ వద్ద ఎ. సత్యారావు , 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీ లో బూడి శ్రీను, నెహ్రూ నగర్ లేబర్ జంక్షన్ వద్ద వై.గంగాధర్ 63వ వార్డు కాకరలోవలో లండ రాజు, క్రాంతినగర్‌లో ఎస్ఎస్ అప్పారావు, వెంకటేశ్వరరావు, 62వ వార్డు గుడివాడ అప్పన్న కాలనీ వద్ద మహేంద్ర, శ్రీహరిపురం ముఠా సంఘం వద్ద గండి రమణ సిఐటియు పతకాలను ఆవిష్కరించారు కార్యక్రమంలో సిఐటియు జోన్ నాయకులు పి పైడిరాజు, ఎస్ వాసు కె.రమణ డి.రాము, బి.రాంబాబు, రామకృష్ణ, ఏసుబాబు, రాజేష్ సుభాని, రామునాయుడు శ్రీను పాల్గొన్నారు.

ఉక్కునగరంలో...

కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న జగ్గునాయుడు

ఉక్కునగరం : ప్రభుత్వం, యాజమాన్యాల నిరంకుశ నిర్బంధాలపై ఐక్య పోరాటాలు చేయాలని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె అయోధ్య రామ్ అన్నారు. స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో స్టీల్ ప్రధాన పరిపాలన భవనం ఎదుట సిఐటియు 55 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యూనియన్ పతాకాన్ని స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి దాస్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో వైటి దాస్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలతో ఐక్యతను విచ్ఛిన్నం చేస్తున్నారని తద్వారా కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను అత్యంత వేగంగా అమలు చేస్తున్నారనివిమర్శించారు.కార్మిక వర్గం అప్రమత్తంగా మెలుగుతూ ఉండి వాటిని వ్యతిరేకించాలన్నారు. ఐక్యతను మరింత బలోపేతం చేయడం కోసం కషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు రామస్వామి మాట్లాడుతూ ప్లాంట్‌ను రక్షించుకుంటూ హక్కుల సాధన కోసం సిఐటియు ఆవిర్భావ స్ఫూర్తితో స్టీల్ సిఐటియు లక్ష్యంగా నిర్ణయించుకుందని ఆయన అన్నారు. స్టీల్ సిఐటియు నాయకులు బి అప్పారావు, బి తౌడన్న, పి శ్రీనివాసరాజు, కె గంగాధర్, టి వి కె రాజు, వి ప్రసాద్, గౌరీ శంకర్, పట్టా రమేష్, పి భానుమూర్తి, డి సత్యనారాయణ, దుర్గాప్రసాద్, అప్పలరాజు, మురళి, బి మహేష్, డి ఎస్ వి ఎస్ శ్రీనివాస్, మురళీకష్ణ, సూరిబాబు, రాజా పాల్గొన్నారు.

గాజువాక : భెల్‌లో సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్మిక పతకాన్ని జి.చిన్నబాబు ఆవిష్కరించారు. సిఐటియు నాయకులు ఎస్ జగన్నాథరావు మాట్లాడుతూ, భెల్ రక్షణకు ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు, సిఐటియు ఆధ్వర్యంలో జరిగాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో గాజువాక జోన్ కార్యదర్శి లోకేష్, సీతన్న నాయుడు, జె కోటేశ్వరరావు, కె నారపరెడ్డి, ఎం వెంకటేశ్వర్లు, సిహెచ్ మురళీశ్వరరావు, కె విజయ్ కుమార్ పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : సిఐటియు ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగింది. సంఘం సీనియర్ నాయకులు వై.రాజు పతాకావిష్కరణ చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ 1970లో సిఐటియు ఆవిర్భావం ఆవశ్యకత వివరించారు. కార్యక్రమంలో సంఘం జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి, మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.చంద్రశేఖర్, జి.పోలేశ్వరరావు, ఎం.సూరీడు, ప్రదీప్, మెడికల్ రిప్రజెంటేటివ్స్ సంఘం నాయకులు సంజయ్ కుమార్, రామారావు పాల్గొన్నారు.

మహారాణిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మోదకొండమ్మను దర్శించుకున్న

మాడుగుల మహారాణి

ప్రజాశక్తి-మాడుగుల: మాడుగుల మోదకొండమ్మ అమ్మవారిని శుక్రవారం ఉదయం మాడుగుల మహారాణి మయాంక్ కుమారీ దేవ్ దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన మహారాణి మయాంక్ కుమారీ దేవ్.ని ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు కమిటీ సభ్యులు సాదరంగా ఆహ్వానించారు. అమ్మవారి దర్శనం అనంతరం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దంగేటి సూర్యారావు, శ్రీనాద్ శ్రీనివాసురావు, భీమారశెట్టి పైడియ్య నాయుడు , పాత, కొత్త ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

బైక్ ర్యాలీని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై జూన్ 4వ తేదీన నర్సీపట్నంలో చేపట్టబోయే కార్యక్రమాల నేపథ్యంలో స్థానిక మాజీ ఎమ్మెల్యే గణేష్ క్యాప్ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ నేతలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం 2024 ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చని నేపథ్యంలో నిరసనగా వెన్నుపోటు దినం అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు. జూన్ 4వ తేదీన నర్సీపట్నం మున్సిపాలిటీ సిబిఎం కాంపౌండ్ నుంచి పెద్ద బొడ్డేపల్లి జంక్షన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని బైక్ ర్యాలీ విజయవంతం చేయాలని కోరారు.

పనులను పరిశీలిస్తున్న అధికారులు

వంతెన పనులు వేగవంతం

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో పాములవాక గ్రామంలో ఏలేరు కాలవపై గతంలో 2.50 కోట్లతో నిర్మించిన గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు నిర్మించిన వంతెన సాంకేతిక లోపం తలెత్తడంతో సంబంధిత పనులకు 50 లక్షలతో పునరుద్ధరణ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. గతంలో నిర్మించిన వంతెనపై నీళ్లు నిలిచి పోవడంతో రైతులు ఇబ్బంది పడేవారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పనులను వేగవంతంగా చేస్తున్నారు. ఈ మేరకు ఇంజనీరింగ్ అధికారులు డిఇ శ్రీహరి, ఏఈ వెంకటేష్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రానున్న ఖరీఫ్ సీజన్లో రైతుల వ్యవసాయ పనులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడతామని తెలిపారు. శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

స్పీకర్ ఇంటికి చినజీయర్ స్వామి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఇంటికి ఆధ్యాత్మికవేత్త చినజీయర్ స్వామి శుక్రవారం వచ్చారు. భీమిలిలో అంధుల పాఠశాల స్థాయి పెంపు కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు వచ్చారని స్వామీజీ పేర్కొన్నారు. వికాస తరంగిణి సంస్థ భాగస్వామ్యంతో మహిళలకు క్యాన్సర్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా చికిత్స అందిస్తున్నట్టు తెలిపారు. ఇందుకోసం ప్రతి గ్రామంలో 20 మంది మహిళలకు శిక్షణ ఇవ్వాలని ఉద్దేశించినట్టు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకారం లభిస్తే ఈ సేవలను మరింత విస్తతంగా అందించే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చినజీయర్‌స్వామితో అయ్యన్న దంపతులు

54 మందికి నియామక పత్రాలు

ప్రజాశక్తి -పాడేరు: జాబ్ మేళా ద్వారా ఉపాధి పొందిన అభ్యర్థులందరూ మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ సూచించారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పాడేరు గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ వద్ద జరిగిన జాబ్ మేళాలో ఎంపికైన 54 మందికి నియామక పత్రాలను ఐటిడిఎ సమావేశ మందిరంలో కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి కల్పించే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన ఈ జాబ్ మేళాలతో అనేక మంది ఉపాధి పొందుతున్నారని, వారంతా మరింత కష్టపడి మెరుగైన అవకాశాలు పొందాలని సూచించారు. ఈ జాబ్ మేళాలో తొమ్మిది కంపెనీలు పాల్గున్నాయని, 183 మంది నిరుద్యోగ యువత హాజరు కాగా 54 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందని, మరో 34 మందిని తదుపరి ఇంటర్వ్యూ దశకి ఎంపిక చేయడం జరిగిందని జిల్లా నైపుణ్యాబివృద్ధి అధికారి . పి. రోహిణి కలెక్టర్ కు వివరించారు.

సాగు భూములకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన సాగు భూములకు ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం.రాజేష్, మాజీ ఎంపిటిసి సభ్యులు గింజాల వెంకటరమణ డిమాండ్ చేశారు. మండలంలోని డిఎల్ పురం గ్రామానికి చెందిన సాగుదారులతో కలిసి శుక్రవారం తహసిల్దార్ నరసింహమూర్తికి వినతిపత్రం అందజేశారు. డిఎల్ పురం గ్రామంలో సర్వే నెంబర్ 85లో సాగు భూమి కి సంబంధించి సాగులో ఉన్న రైతులకు ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని, చెట్లకు, నిర్మాణాలకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సాగు భూములను పూర్తిస్థాయిలో సర్వే చేసి వాస్తవంగా ఉన్న భూమిని పరిగణనలోకి తీసుకుని పరిహారం చెల్లించాలన్నారు. అదేవిధంగా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి అర్హులను గుర్తించి, 25 లక్షల రూపాయల చొప్పున ప్యాకేజీ చెల్లించాలని కోరారు. మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో సర్వే నెంబర్ 290లో గల సాగు భూములకు, సాగు భూముల్లో గల చెట్లకు పరిహారం చెల్లించాలని ఎంపిటిసి సభ్యులు పిక్కి సత్తయ్య, నాయకులు పిక్కి కోదండరావు, పిక్కి గంగరాజు సాగుదారులతో కలిసి డిటి నారాయణరావు కు వినతి పత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో వాసపల్లి శివ, చిట్టిబాబు, చిరంజీవి, బాబ్జి, వసంతమ్మ పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న నాయకులు, నిర్వాసితులు

బెట్టింగ్ ఉచ్చులో యువత

- ఆర్థికంగా నష్టపోతున్న వైనం

ప్రజాశక్తి- మాడుగుల : బెట్టింగ్ మాఫియా ఉచ్చులో యువత పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.అభం,శుభం తెలియని యువత బెట్టింగ్ రాయుల్లు చూపించిన అత్యధిక డబ్బుల ఆశకు బలైపోతున్నారు. బెట్టింగ్ మాఫియాపై అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం విశేషం.మాడుగుల కేంద్రంలో బెట్టింగ్ రాయుళ్ల వలలో చిక్కుకొని భూములను, ఆస్తిని సైతం పోగొట్టుకున్న పరిస్థితులు నెలకొంటున్నాయి.

మాడుగుల కేంద్రంలో ఓ వ్యక్తి సాదాసీదా వ్యాపారం చేస్తూ, జీవనం సాగించేవాడు. ఆ వ్యక్తి క్రికెట్ బెట్టింగులకు అలవాటు పడి బూకీలుగా వ్యవహరించి కొంత మొత్తంలో డబ్బు సంపాదించడం అలవాటు పడ్డాడు. దీంతో, గ్రామంలో అతని వెంట కొందరి యువకులను తిప్పుకొని, బెట్టింగులపై పెద్ద మొత్తంలో నగదు వస్తుందని ఆశ చూపించి పదుల సంఖ్య నుంచి వందల సంఖ్య బుకీలను తయారు చేసి ప్రధాన బుకీగా వ్యవహరిన్నాడు.ఆ బెట్టింగు రాయుడు మాయ మాటల్లో పడి ఇటీవల కొంతమంది యువకులు పెద్ద మొత్తాల్లో డబ్బు పందెం పెట్టి అప్పుల్లో కూరుకు పోయిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. కొందరు యువకులు సొంత ఆస్తులు అమ్మడం గమనార్హం.

బెట్టింగు రాయుళ్ల మాయలో పడి నా కుమారుడు విద్యాబోధన అర్ధవంతంగా వదిలేసి బెట్టింగులకు పాల్పడి నష్టపోయిన నగదుని తీర్చమని బెట్టింగ్ రాయుళ్ల ఒత్తిడిని తట్టుకోలేక ఉన్న భూములు, పొలాలు అమ్ముకొని హుందాగా బతకాల్సిన నా కొడుకు ఇప్పుడు వారి చెప్పు చేతల్లోనే తిరుగుతూ జీవిస్తున్నాడని ఓ తల్లి కన్నీరుమున్నీరవుతున్న పరిస్థితి మాడుగుల కేంద్రంలో చోటుచేసుకుంది.

మాట్లాడుతున్న ఎంపిపి రాజారాం

మోదకొండమ్మ జాతరను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-మాడుగుల:వచ్చే నెల 3వ తేదీ మంగళవారం జరిగే మాడుగుల మోదకొండమ్మ జాతరను విజయవంతం చేయాలని ఎంపీపీ రాజారాం కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని తెలిపారు. మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి, 108,104 వాహనాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. విద్యుత్‌కి అంతరాయం కలగకుండా చూడాలన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగిన బందోబస్తుని ఏర్పాటు చేయాలని కోరారు. అందరూ సమిష్టిగా కృషి చేసి జాతర విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, ఎంపీడీవో కొంకి అప్పారావు, తహసిల్దార్ కే రమాదేవి, ఏఈ నాగమల్లేశ్వరి, సిడిపిఓ శ్రీదేవి, ఎస్సై నారాయణరావు, అగ్నిమాపక అధికారి వి.రాజేశ్వరరావు, పంచాయితీ కార్యదర్శి మూర్తిబాబు, మెడికల్ సూపర్డెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పరిశ్రమలు నెలకొల్పే వారికి సహకారం

కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు వచ్చే పారిశ్రామిక ఔత్సాహికులకు పూర్తి సహకారం అందించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా ఇండస్ట్రియల్ ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డిఐఈపిసి) సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గత సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న చర్యలపై సమీక్షించారు. గంగవరం పోర్టు నుండి నేషనల్ హైవే రోడ్డు కనెక్టివిటీ, ఎపిఐఐసి ఇండస్ట్రీస్ నందు 30 వ్యక్తిగత యూనిట్లకు వాటర్ ట్యాక్స్, ఎపిఐఐసి ఐలా, ఆటోనగర్, మధురవాడ ఐటి పార్క్ వద్ద బస్టాప్ ఏర్పాటు తదితర అంశాలపై చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమీక్షా సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జిఎం వి.ఆదిశేషు, వివిధ పరిశ్రమల నిర్వాహకులు, ఐలా ప్రతినిధులు,వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్

థియేటర్లలో.. తినుబండారాల ధరలను నియంత్రించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో సినిమా థియేటర్లలో కనీస సౌకర్యాలు కల్పించకుండా తినుబండారాల ధరలు విపరీతంగా పెంచి దోపిడీ చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పోరాట సమితి అధ్యక్షులు జి.ఎ నారాయణరావు డిమాండ్ చేశారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణకు చెందిన నలుగురు ఏపిలో దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. థియేటర్లను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. రాష్ట్రంలో ఫిల్మ్ చాంబర్ ఏర్పాటు చేయాలన్నారు. థియేటర్లలో తినుబండారాల వ్యవహారంపై వారం రోజుల్లోగా తాము న్యాయపోరాటం చేస్తామన్నారు. సమావేశంలో సీనియర్ న్యాయవాది పాకా సత్యనారాయణ, తోట రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నారాయణరావు

జిజిహెచ్‌లో రిహాబిలిటేషన్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు జిజిహెచ్ లో ఏర్పాటు చేసిన ఎబిలిటీ పీపుల్ రిహాబిలిటేషన్ సెంటర్ సేవలను అవసరమైన రోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ సూచించారు. శుక్రవారం జిజిహెచ్‌లో ఏర్పాటు చేసిన ఎబిలిటీ పీపుల్ రిహాబిలిటేషన్ సెంటర్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ కేంద్రం గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సంరక్షణను పెంచుతుందన్నారు. రిహాబిలిటేషన్ కేంద్రం ద్వారా , ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, ప్రోస్టేటిక్స్ థెరపీ వంటి సమగ్ర పునరావాసాన్ని అందించడం ద్వారా వారి జీవితాలను మారుస్తుందని, శక్తిని పుంజుకుంటారని వివరించారు. పేద వర్గాలకు ఆరోగ్య సంరక్షణ అందుబాటులో ఉండటంలో ఒక ముఖ్యమైన అడుగు ముందుకు పడిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ నరసింహారావు, సమగ్ర శిక్ష ఏపిసి స్వామి నాయుడు పాల్గొన్నారు.

పలుచోట్ల వర్షం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని శుక్రవారం సాయంత్రం వర్షం కురిసింది. సాయంత్రం ఐదు గంటల సమయంలో ఒక్కసారిగా ఆకాశంలో నల్లటి మేఘాల కమ్ముకుని వర్షం కురి సింది. వర్షంతో ప్రయాణి కులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. నక్కపల్లి వారపు సంతలో కూరగాయల వ్యాపారదారులు వర్షంతో తడిసి ముద్దయ్యారు.

నక్కపల్లిలో కురుస్తున్న వర్షం

కోటవురట్ల:మండల వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం 3 గంటల నుంచి ఎడతెరిపి లేకుండా సాయంత్రం 6 వరకు వర్షం కురిసింది. ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోయాయి. ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు సాయంత్రం వర్షం కారణంగా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఎదురైంది.